### కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి


అధికారంలోకి వచ్చి ఒక్క హామీని కూడా అమలు చేయని కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయం. గతంలో ప్రభుత్వ ఉద్యోగాలు 75శాతం మాత్రమే స్థానికులకు వచ్చేవి. తెలంగాణ వచ్చినంక 95శాతం తెలంగాణ బిడ్డలకే వచ్చేలా చర్యలు తీసుకున్నారు. ఎంతో చైతన్యం గల పట్టభద్రులు బీఆర్‌ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలి.

-ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

- కాంగ్రెస్‌వన్నీ మోసపు హామీలే..
- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- కేసీఆర్ రుణం తీర్చుకోవాలి
- మాజీ మంత్రి సత్యవతిరాథోడ్
- ఆశయం, అహంకారానికి మధ్య పోటీ
- ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్
- ప్రశ్నించే గొంతుకనవుతా
- బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి
- మహబూబాబాద్, స్టేషన్‌ఘన్‌పూర్, పరకాల నియోజకవర్గాల ఎమ్మెల్సీ సన్నాహక సమావేశాలు





మహబూబాబాద్‌లో మాట్లాడుతున్న అభ్యర్థి రాకేశ్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే పల్లా, ఎమ్మెల్సీ సత్యవతి, ఆర్‌ఎస్‌పీ, మడికొండలో మాట్లాడుతున్న రాజయ్య

# బీఆర్‌ఎస్‌ను ఆశీర్వదించండి

## తొలి ప్రాధాన్యత ఓటు వేసి రాకేశ్‌రెడ్డిని గెలిపించండి

మహబూబాబాద్ రూరల్/ మడికొండ/ దామెర, మే 18 : కాంగ్రెస్ గ్యారెంటీలన్నీ ప్రజలను మోసం చేసే హామీలే తప్ప ఒక్కటి కూడా అమలు చేయలేదని, పట్టభద్రులు బీఆర్‌ఎస్‌ను ఆశీర్వదించాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. వరంగల్-ఖమ్మం- నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక సన్నాహక సమావేశాలు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా శనివారం జరిగాయి. మహబూబాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి సమావేశం మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అధ్యక్షతన పట్టణంలోని బాలాజీగార్డెన్‌లో, స్టేషన్ ఘన్‌పూర్ అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి సమావేశం స్టేషన్ ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అధ్యక్షతన మడికొండలోని సత్యసాయి కన్వెన్షన్‌లో, పరకాల అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి సమావేశం మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అధ్యక్షతన హనుమకొండ జిల్లా దామెర మండల కేంద్రంలోని ఏఎన్‌ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం మహబూబాబాద్ మెడికల్ కళాశాల, ఇంజినీరింగ్, నర్సింగ్, ఉద్యాన కళాశాలను ఏర్పాటు చేసి ఎడ్యుకేషన్ హబ్‌గా చేసిందన్నారు. కేసీఆర్ రుణం తీర్చుకునేందుకు రాకేశ్‌రెడ్డిని గెలిపించుకోవాలన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ఈ ఎన్నిక ఆశయానికి, అహంకారానికి మధ్య జరుగుతోందని, పేదల సమస్యలను గాలి వదిలేసిన కాంగ్రెస్ పార్టీ అహంకారంతో బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తోందన్నారు. రాకేశ్‌రెడ్డి వంటి మేధావులను చట్టసభల్లో కూర్చోబెట్టాలని కోరారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్ రెడ్డి మాట్లాడుతూ నిరుద్యోగ సమస్య, జాబ్ క్యాలెండర్, ఉద్యోగుల సమస్యలపై ప్రశ్నించే గొంతుకను అవుతానని తెలిపారు. ఐదు నెలలుగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో నిరుద్యోగులకు చేసిందేమీ లేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో నోటిఫికేషన్లు ఇచ్చి పరీక్షలు నిర్వహించిన వాటికి జాబ్ సర్టిఫికెట్స్ అందజేసి తామే జాబ్‌లు ఇచ్చామని కాంగ్రెస్ ప్రభుత్వం భ్రమ కల్పిస్తోందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న బ్లాక్ మెయిలర్, చీటర్ అని, ఇప్పటికే నాలుగు పార్టీలు మారాడని పేర్కొన్నారు. ఆయనపై 56 క్రిమినల్ కేసులు ఉన్నాయని, మోసగాడు కావాలా విద్యావంతుడు కావాలో పట్టభద్రులు ఆలోచించాలని, తాను జాబ్ మేళాలు నిర్వహించి 692 మంది నిరుద్యోగులకు ఆఫర్ లెటర్స్ అందించినట్లు చెప్పారు. వరంగల్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్, కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, బీరవెల్లి భరత్‌కుమార్, యాకుబ్‌రెడ్డి, లునావత్ అశోక్‌నాయక్, మల్లయ్య, కవిత రాంజీ నాయక్, వెంకన్న, జడ్పీటీసీలు పోలీస్ ధర్మారావు, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.


# హామీలు నెరవేర్చేదాకా పోరాడుతా

- కాంగ్రెస్ అభ్యర్థి మోసగాడు.. గ్రాడ్యుయేట్లు నమ్మొద్దు
- బీజేపీ నన్ను రోడ్డున పడేస్తే.. బీఆర్‌ఎస్ అక్కున చేర్చుకుంది
- జర్నలిజాన్ని ఎర్నలిజంగా మార్చిన కాంగ్రెస్ అభ్యర్థి
- 'మీట్ ద ప్రెస్'లో ఎమ్మెల్సీ బీఆర్‌ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి



మీట్ ద ప్రెస్'లో మాట్లాడుతున్న ఖమ్మం-వరంగల్-నల్లగొండ, బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి

హనుమకొండ చౌరస్తా, మే 18 : ప్రభుత్వ మెడలు వంచి ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకూ పోరాడుతానని వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి అన్నారు. శనివారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో 'మీట్ ద ప్రెస్'లో ఆయన మాట్లాడారు. గెలిస్తే తన ఎమ్మెల్సీ వేతనంతో విద్యార్థి, నిరుద్యోగ సంక్షేమ నిధి ఏర్పాటుచేస్తానన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రైతుబంధు అడిగితే రైతులను చెప్పుతో కొడతా అని వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీశాడని, అలాంటి వ్యక్తికి ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు. జీవో 46ను ప్రభుత్వం రద్దు చేసేవరకూ సభను స్తంభింపజేస్తానన్నారు. ప్రతి గ్రాడ్యుయేట్ గల్లా ఎగరేసేలా తన నడవడిక ఉంటుందన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానమైన వరంగల్-ఖమ్మం-నల్లగొండ ప్రాంతంలో 32మంది అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఉంటే కేవలం ఇద్దరు ఎమ్మెల్యేలు మాత్రమే ప్రతిపక్షానికి చెందిన వారున్నారని, ప్రతిపక్షం బలంగా ఉంటేనే ప్రజాస్వామ్యం ఫరిడవిల్లుతుందని పేర్కొన్నారు. తాను ఓరుగల్లు బిడ్డనని, కష్టపడి చదివి బిట్స్ పిలానీలో సీటు సాధించి గోల్డ్ మెడల్ పొందానని గుర్తుచేశారు. విద్యార్థి సంఘం ఎన్నికల్లో రెండుసార్లు అత్యధిక మెజార్టీతో గెలిపించారన్నారు. కేసీఆర్ తనను ఆశీర్వదించి పంపారని, నాలుగు సార్లు ఈ గడ్డపై బీఆర్‌ఎస్ జెండా ఎగిరిందన్నారు. చుక్కా రామయ్య నుంచి పల్లా రాజేశ్వర్‌రెడ్డి వరకు సమాజానికి ఆదర్శంగా నిలిచే వారిని ఎమ్మెల్సీగా ఎన్నుకున్నారని, మోసగాళ్లను నమ్మొద్దని మేధావులకు పిలుపునిచ్చారు. 2013లో రాజకీయాల్లోకి వచ్చానని, అమెరికాలో ఉద్యోగాన్ని తృణప్రాయంగా వదిలేశానని, పుట్టిన గడ్డ రుణం తీర్చుకునేందుకు ఇక్కడనుంచి పోటీ చేస్తున్నట్లు చెప్పారు. బీజేపీలో ప్రజాపోరాటం చేశానని, కులం, మతం, వర్గం అనే బేధం లేకుండా సమస్యలపై పోరాడానన్నాను. బీజేపీ తనను రోడ్డున పడేస్తే, కొన ఊపిరితో ఉన్న తనను కేసీఆర్ అక్కున చేర్చుకుని ఎమ్మెల్సీగా అభ్యర్థిగా ఇక్కడికి పంపించారన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చడం లేదని, బలమైన ప్రతిపక్షం ఉంటే నిర్మాణాత్మక పాత్ర పోషిస్తుందన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి ఎమ్మెల్సీగా గెలిస్తే సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తారా?.. తనను గెలిపిస్తే సమస్యలపై నిలదీస్తానన్నారు. నిరుద్యోగ కోసం జాబ్‌మేళాలు నిర్వహించానని, కోచింగ్ సెంటర్లో ఫీజు కట్టలేకపోతున్న వారి కోసం ఈ-క్లాసెస్ యాప్‌ను ఉచితంగా రూపొందించానని పేర్కొన్నారు. జర్నలిజానికి ఎంతో ప్రాముఖ్యం ఉందని, జర్నలిజాన్ని ఎర్నలిజంగా మార్చిన కాంగ్రెస్ అభ్యర్థిని నమ్మొద్దని పిలుపునిచ్చారు. ఐపీఎల్ మ్యాచ్ కంటే కేసీఆర్ మీటింగ్‌కు రేటింగ్ ఎక్కువ ఉందన్నారు. వరంగల్ జర్నలిస్టులు తనను ఇక్కడిదాకా తీసుకొచ్చారని, రాష్ట్ర స్థాయి నాయకుడిగా నిలబెట్టారన్నారు. మీ సహకారం ఉంటే మండలిలో ప్రతినిధిగా గౌరవాన్ని కాపాడుతానని స్పష్టం చేశారు. ఎమ్మెల్సీగా గెలుచి కేసీఆర్‌కు బహుమతిగా ఇస్తానన్నారు. సమావేశంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, కార్యదర్శి బొల్లారపు సదయ్య పాల్గొన్నారు.





ఉధృతంగా ప్రవహిస్తున్న మోరంచ వాగు



వరి పంటను ముంచెత్తిన వరద



నేలవాలిన వరి పంటను చూపుతున్న రైతు

# ఆగని వాన.. రైతన్న ఆందోళన

## మూడు రోజులుగా ఉధృతంగా ప్రవహిస్తున్న మోరంచ వాగు


- చేతికందే దశలో మొలకెత్తిన ధాన్యం
- ఆందోళనలో అన్నదాతలు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

గణపురం, మే 18 : మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు గణపురం మండలంలోని సీతారాంపురం, వెల్తుర్లపల్లి గ్రామాల మధ్యలోని మోరంచ వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. దీంతో వాగు పరిసర ప్రాంతాల్లోని వరి పంట పొలాలు నీట మునిగాయి. నేలవాలిన వరి పంట చేతికందే దశలో నీటిలోనే మొలకెత్తడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మరో 20 రోజుల్లో కోతలు పూర్తి చేసి ధాన్యాన్ని విక్రయించే సమయంలో వర్షాలు తమ పాలిట శాపంగా మారాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గణపురం మండలకేంద్రంతో పాటు కొండాపూర్, ధర్మారావుపేట, నగరంపల్లి, చెల్పూర్, బుద్ధారం, మైలారంలో పంట నీట మునగడంతో రైతులకు కోలుకోలేని దెబ్బ తగిలినట్లైంది. దీనికితోడు కొనుగోలు కేంద్రాలకు తరలించిన ధాన్యం సైతం తడవడంతో పాటు వరదలో కొట్టుకుపోయింది. ధాన్యాన్ని కాపాడుకునేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని అన్నదాతలు వేడుకుంటున్నారు.



ఇంచర్ల పీఏసీఎస్ చైర్మన్‌ను నిలదీస్తున్న రైతులు, హమాలీలు

- లారీలు వెనక్కి ఎందుకు పంపారు..?
- మళ్లీ వడ్లు తడిస్తే బాధ్యులెవరు..?
- ఇంచర్ల పీఏసీఎస్ చైర్మన్‌ను నిలదీసిన రైతులు
- 20 రోజులుగా ఇబ్బందులు పడుతున్నామంటూ ఆగ్రహం



ములుగు రూరల్: మొలకెత్తిన వడ్లు

# ధాన్యాన్ని మిల్లుకు తరలించరా?

ములుగు, మే 18 (నమస్తే తెలంగాణ) : లారీ యజమానులు, రైస్ మిల్లర్లు ధాన్యాన్ని మిల్లులకు ఎందుకు తరలించడం లేదని ఇంచర్ల పీఏసీఎస్ చైర్మన్ చిక్కుల రాములు రైతులు నిలదీశారు. ములుగు మండలం జంగాలపల్లి గ్రామం పీఏసీఎస్ కొనుగోలు కేంద్రం వద్ద వడ్లను 20 రోజులుగా ఎందుకు కొనుగోలు చేయడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చిన లారీలను వెల్లగొట్టడం ఏమిటని మండిపడ్డారు. గురు, శుక్రవారాల్లో కురిసిన వర్షానికి ధాన్యం తడిసింది. శనివారం సివిల్ సప్లయ్ డీఎం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి కాంటాలు వేసిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించాలని ఆదేశించారు. అయినా కొనుగోలు కేంద్రం నిర్వాహకులు పట్టించుకోలేదు. సాయంత్రం ఒక లారీ ధాన్యపు బస్తాలను తరలించేందుకు కొనుగోలు కేంద్రం వద్దకు రాగా గతంలో ధాన్యాన్ని తరలించిన ఒక లారీ యజమాని మూడు రోజుల క్రితం ఎగుమతికి బాణాలపల్లి రైస్ మిల్లుకు పంపించగా అక్కడ వారు దిగుమతి చేసుకోవడం లేదని, వెయిటింగ్ కిరాయిలు పడుతున్నాయని తెలిపాడు. దీంతో రైతులు రైస్ మిల్లర్లతో మాట్లాడించిన తర్వాతనే వడ్లను లోడ్ చేసుకుంటామని లారీ యజమాని తెలియజేయడంతో ధాన్యం తరలింపు నిలిచిపోయింది. ఈ విషయంపై పీఏసీఎస్ చైర్మన్‌ను రైతులు, హమాలీలు నిలదీశారు. దీంతో చైర్మన్ జిల్లాలో 70 లారీలు ఉంటే 150 కొనుగోలు కేంద్రాలు ఉన్నాయని, ధాన్యం తరలింపు విషయంలో ఇబ్బందులు ఏర్పడుతుందని రైతులకు నచ్చజెప్పారు. మళ్లీ వర్షం వస్తే వడ్లు తడుస్తాయని, 20 రోజులుగా అనుకున్న మేరకు ధాన్యం కొనుగోలు చేపట్టకుండా ఇబ్బందులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.



ములుగు రూరల్ : మొలకెత్తిన వడ్లను చూపిస్తున్న గఫూర్ పాషా, రైతులు



వెంకటాపూర్ మండలం వెల్తుర్లపల్లి కొనుగోలు కేంద్రంలో మొలకెత్తిన ధాన్యం

### వరి కోసిన వెంటనే కొనుగోలు చేయాలి

ములుగు రూరల్ : వరి కోసిన వెంటనే కొనుగోలు చేసి మద్దతు ధర కల్పించాలని తెలంగాణ రైతు సంఘం ములుగు జిల్లా కార్యదర్శి గఫూర్‌పాషా డిమాండ్ చేశారు. శనివారం ఆయన మండలంలోని జంగాలపల్లి వద్ద తడిసిన వడ్లను పరిశీలించారు. అధికారులు బాయిల్డ్ రైస్ మిల్లర్లతో మాట్లాడి కోసిన తడి వడ్లను నేరుగా తరలించి కొనుగోలు చేపట్టాలన్నారు. అకాల వర్షాలు కురుస్తున్నందున ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యాన్ని ఆరబోసి తేమ శాతాన్ని తగ్గించలేకపోతున్నారని తెలిపారు.